సాక్షి
జనగామ

సోమవారం । 31 । జూలై । 2023



రూ.43 లక్షలు నీళ్లపాలు

రఘునాథపల్లి మండలగూడెం వాగు వద్ద రూ.43లక్షలతో నిర్మించిన కాజ్‌వే ఇటీవల వర్షాలతో కూలిపోయింది. - 9లో



అక్రమ కట్టడాల తొలగింపు

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ప్రభుత్వ భూమిలో బీఆర్‌ఎస్ నేతల అండతో నిర్మించిన కట్టడాలను అధికారులు తొలగించారు. - 9లో

గరిష్టం/కనిష్టం $30^{0}/25^{0}$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంట నష్టం పరిశీలన



సాక్షి స్పందన

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామ శివారు కాశీనగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లో ఇసుక మేటలు అని 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన వ్యవసాయ అధికారులు ఆదివారం నష్ట పోయిన పంటలను పరిశీలించారు. పోచన్నపేట పెద్ద వాగుపై చెక్ డ్యాంను నిర్మించి దానికి ఇరువైపులా అడ్డు గోడలను నిర్మించలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి సమీపంలోని 30 ఎకరాల పంట నష్టం వాటిల్లింది. పొలాల్లో పంటలు కొట్టుకుపోవడంతో పాటు ఇసుక మేటలు వెలిశాయి. నష్ట తీవ్రతను అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు నర్సిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భిక్షపతి, కిష్టయ్య, వెంకటేష్, కొమురయ్య, సత్తయ్య, కనుకయ్య పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంటనష్టం అంచనా

జనగామ రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని గండిరామవరం, చీటకోడూర్, నవాబుపేట, స్టేషన్ ఘన్‌పూర్, మైలారం రిజర్వాయర్లు మత్తళ్లు పోస్తున్నాయి. ఇప్పటి వరకు ఆరు పశువులు మృతి చెందగా 314 చోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా 6 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 28 చోట్ల కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లు కోతకు గురి కాగా 20 చెరువులకు గండ్లు పడ్డాయి. లింగాల ఘనపురం పటేల్‌గూడెం, వెల్దండ-నర్మెట, రఘునాథపల్లి మండలంలోని మాధారం నుంచి దాసన్నగూడెం, జనగామ మండలంలో ఎర్రగొల్లపహడ్- పెద్దతండా (వై), గోపిరాజుపల్లి, గానుగుపహడ్ గ్రామం జనగామ నర్మెట ప్రధాన రహదారి అడవికేశాపూర్-కన్నెబోయిన గూడెం, చీటకోడూర్, చౌడారం గ్రామాల మధ్య ఎల్లంల-సిద్దెంకి గోపిరాజుపల్లి-కేసిరెడ్డిపల్లి, అడవికేశావాపూర్-వెంకిర్యాల గ్రామాల మధ్య రాకపోకలు నేటికి ప్రారంభం కాలేదు.

రేపు అప్రెంటిస్‌షిప్ మేళా

విద్యారణ్యపురి: ఒకేషనల్ కోర్సులతో 2020–21, 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు డీఐఈఓ ఎ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పారామెడికల్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, నాన్ పారామెడికల్ కోర్సుల వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐదు సెట్ల జిరాక్స్‌కాపీలు, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటిస్‌షిప్ ఇండియా.గౌట్.ఇన్, ఆర్‌డీఎస్‌డీ తెలంగాణ, డీజీటీ గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చన్నారు.

సూపరింటెండెంట్‌పై పరువునష్టం దావా వేస్తా..

జనగామ రూరల్: జనగామ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు తప్పుడు నివేదిక ఇవ్వడంతో తన ఉద్యోగంతో పాటు తండ్రిని కోల్పోయాను.. తప్పులు నివేదికలు ఇస్తున్న రిటైర్డ్ డీఎస్పీ నాగరాజుతోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై పరువునష్టం దావా వేస్తానని రిటైర్డ్ డీఎస్పీ నాగరాజు మాజీ అల్లుడు దామోదర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌డండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఆయన విలేకరులతో మట్లాడుతూ.. భార్యను కాలితో తన్నడం వల్ల అబార్షన్ అయిందంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్ తప్పుడు నివేదిక ఇవ్వగా తాను 21 రోజులు జైలుకు పోవాల్సి వచ్చిందని చెప్పాడు. తప్పుడు నివేదికతో జాబ్ పోవడంతోపాటు కుటుంబం ఇబ్బందులపాలైందని, తండ్రి మృతి చెందాడని పేర్కొన్నాడు. 2012లో కేసు వేయడంతోపాటు మెడికల్ కౌన్సిల్‌కు అప్పీల్ చేసినట్లు తెలిపారు. భౌతికంగా పేషంట్ ఆస్పత్రికి రాలేదని తప్పుడు రికార్డులు సృష్టించారని, తన వద్ద అన్ని ఆధారాలున్నాయని, పరువు నష్టం కింద దావా వేస్తాననని తెలిపాడు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ వాయిదా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం(నేడు) నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. తిరిగి గ్రీవెన్స్ మంగళవారం నిర్వహిస్తామని, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని ఒక ప్రకటనలో కోరారు.

జాబితా సిద్ధం!

- రూ.లక్ష ఆర్థికసాయానికి 8,978 దరఖాస్తులు
- మొదటి విడతలో 520 మందికి క్లియరెన్స్
- వారం రోజుల్లో చెక్కుల పంపిణీ



జనగామ: కులవృత్తుల ఆర్థికాభివృద్ధి కాంక్షిస్తూ... ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన రూ.లక్ష ఆర్థికసాయం స్కీంలో చెక్కుల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. మొదటి విడతలో అర్హుల జాబితాను సిద్ధం చేసిన అధికారులు.. సర్కారు నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం చూస్తున్నారు. వేలల్లో వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసిన అధికారులు..అనర్హులను తొలగించారు. మండలాల వారీగా గ్రామానికి రెండు కూడా వచ్చే పరిస్థితి లేక పోవడంతో... రేపటి ఎన్నికల సమయంలో ఓట్లకు వెళితే ఎలా అనేదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో రూ.లక్ష స్కీం కోసం 8,978 దరఖాస్తులు వచ్చాయి. జూన్ 6వ తేదీన మొదలైన దరఖాస్తుల స్వీకరణ అదే నెల 20వ తేదీన ముగిసింది. ఎంపీడీఓల సమక్షంలో వాటిని పరిశీలన చేసి 6,439 మంది అర్హత ఉన్నట్లు గుర్తించి, 2,359 దరఖాస్తులను తిరస్కరించారు. మొదటి విడుతలో 15 కులాలకు అవకాశం ఇవ్వగా, బీసీ కులంలోని ఇతరులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు క్షేత్రస్థాయి విచారణ తర్వాత, వాటిని అనర్హత జాబితాలో ఉంచారు. మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను జిల్లా కమిటీ కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య నేతృత్వంలో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీఆర్డీఓ పీడీ సమక్షంలో తుది జాబితాను సిద్ధం చేశారు.

నియోజకవర్గానికి 300 చొప్పున..

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గానికి 300 చొప్పున మొత్తంగా 900 రూ.లక్ష స్కీం లబ్ధిదారులను కేటాయించారు. ఇందులో జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాలు సిద్దిపేట పరిధిలో ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్, వేలేరు మండలాలు హనుమకొండ జిల్లాలో కలువగా, పాలకుర్తిలోని తొర్రూరు, పెద్దవంగర మహబూబాబాద్ జిల్లా, వరంగల్ జిల్లాలో రాయపర్తి ఉంది. దీంతో జనగామ జిల్లాలో ఉన్న 12 మండలాలకు 520, ఇతర జిల్లా పరిధిలో ఉన్న 9 మండలాలకు 380 యూనిట్లను కేటాయించారు. ఈ లెక్కన జనగామకు 230, స్టేషన్‌ఘన్‌పూర్‌కు 150, పాలకుర్తి నియోజకవర్గానికి 140 యూనిట్లు ఇచ్చారు. దీంతో గ్రామానికి రెండు యూనిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.

ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిన స్కీం

జిల్లాలో బీసీ కులాల ఓట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వం ఈ జాబితాలో మొదటి విడుతలో 15 కులాలకు మాత్రమే ఈ స్కీం వర్తింప జేస్తుంది. కానీ దరఖాస్తులు మాత్రం ఇందులోని ఇతరులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఎంక్వరీలో వీటిని అధికారులు పక్కన బెట్టారు. దీంతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో ఈ పథకంతో మైనస్ లేదా ప్లస్ అవుతుందా అనే ఆందోళనలో ఉన్నారు. ఒక్కో ఊరిలో సుమారు 100 నుంచి 500 వందలకు పైగా బీసీ కులాలకు చెందిన కులవృత్తి దారులు రూ.లక్ష స్కీం కోసం ఎదురుచూస్తున్నారు.

మండలాల వారీగా అర్హత జాబితా

మండలం	వచ్చిన దరఖాస్తులు	అర్హత	తొలగింపు
బచ్చన్నపేట	540	389	151
చిల్పూరు	497	345	152
దేవరుప్పుల	657	578	79
స్టేషన్‌ఘన్‌పూర్	865	647	218
జనగామ రూరల్	627	408	219
జనగామ అర్బన్	672	532	140
కొడకండ్ల	496	404	92
లింగాలఘనపురం	908	712	196
నర్మెట	493	293	200
పాలకుర్తి	1,015	661	354
రఘునాథపల్లి	860	668	192
తరిగొప్పుల	251	214	37
జఫర్‌గఢ్	917	588	329
మొత్తం	8,798	6,439	2,359

వారంలో పంపిణీకి సిద్ధం

జిల్లాలో అర్హత సాధించిన లబ్ధిదారులకు రూ.లక్ష స్కీం చెక్కును మరో వారం రోజుల్లో అందించేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. తుది జాబితా సిద్ధమైనప్పటికీ, ఇంకా బయట పెట్టడం లేదు. రూ.5.20 కోట్ల మేర మొదటి విడుతలో అందించనుండగా... ప్రభుత్వం నుంచి బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్ లభించగానే.. చెక్కులను పంపిణీ చేస్తారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసి ఉంచారు.

దళారులను నమ్మొద్దు..



రూ.లక్ష స్కీం కోసం దళారులను ఆశ్రయించవద్దు. ఇందుకు ఎవరికీ కూడా రూపాయి ఇవ్వొద్దు. ప్రభుత్వం కులవృత్తులపై ఆధారపడిన అర్హులైన నిరుపేదలకు రూ.లక్ష సాయం చేస్తుంది. దీనిద్వారా వృత్తిని మరింత అభివృద్ధి చేసుకుని, ఆర్థికంగా ఎదగాలి. ఎవరైన స్కీం ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తే, వెంటనే తమకు ఫిర్యాదు చేయాలి.

-రవీందర్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్

పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలి

- టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: జిల్లాలో పారిశుద్ధ్య పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆదేశించారు. ఆదివారం టెలికాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లా స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ అమలు తీరు, పారిశుద్ధ్య ప్రగతిపై ప్రత్యేక అధికారులకు కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేయాలని, త్వరలో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన ఉన్నందున అధికారులు క్షేత్ర స్థాయిలో పనుల లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంతల నిర్మాణం, తడిపొడి చెత్త వేరు చేయడం తదితర పనులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు పూర్తి చేసి జాతీయ స్థాయిలో జనగామను ప్రథమ స్థానంలో నిలుపుటకు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీపీ ఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ వసంత, సీపీఓ ఇస్మాయిల్, డీసీ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నష్టం అంచనాకు కేంద్ర బృందాలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- జనగామలో ఘన స్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

జనగామ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు వరంగల్, ములుగు వరద ప్రాంతాల్లో కేంద్ర బృందంతో పాటు రాష్ట్ర బృందం పరిశీలిస్తారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ పర్యటనలో భాగంగా జిల్లా పార్టీ కార్యాలయానికి రాగా జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టం అంచనాను కేంద్ర బృందం పరిశీలిస్తుందన్నారు. అనంతరం రిజర్వేషన్ పెంపు కోసం గిరిజన సంఘాల నాయకులు వినిత పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల ప్రమేందర్ రెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి, నాయకులు బేజాడి బీరప్ప, ఉడుగుల రమేష్, సౌడ రమేష్, శివరాజ్, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



పనులను పర్యవేక్షిస్తున్న డీఈ, ఏడీఈ

చిల్పూరు: భారీ వర్షాలతో విద్యుత్ పరంగా వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో డీఈ హుస్సేన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సిబ్బంది చేస్తున్న మరమ్మతు పనులను ఏడీఈ సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలతో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయని, రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో స్తంభాలు నీటిలోనే ఉండగా సిబ్బంది సాహసంతో విధులు నిర్వహించారని వారికి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఏఈ రమేష్, లైన్‌ఇన్‌స్పెక్టర్ వడ్డెపల్లి యాదగిరి, జేఎల్‌ఎం అశోక్, కట్టర్ చెరిపెల్లి సురేష్ పాల్గొన్నారు.

కేంద్రం బాధ్యత వహించాలి


- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య
- మణిపూర్ ఘటనపై ఘన్‌పూర్‌లో క్రైస్తవుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



శాంతిర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మణిపూర్‌లో జరిగిన ఘటన మానవత్వానికి మాయని మచ్చ అని, ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మణిపూర్‌లో జరిగిన మారణహోమానికి నిరసనగా స్థానిక నిర్మలామాత దేవాలయ కథోలిక సంఘం ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం డివిజన్ కేంద్రంలో శాంతిర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి గాంధీ చౌరస్తా మీదుగా రైల్వేగేట్ వరకు, అక్కడ నుంచి బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మణిపూర్ ఘటనలు దేశానికే సిగ్గుచేటని, 153 చర్చిలను, 7 వేల ఇండ్లను ధ్వంసం చేశారని, మహిళపై పాశవికంగా అత్యాచారం చేశారన్నారు. మతసామరస్యం నెలకొనేలా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులను చేతిలో పట్టుకుని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, సింగపురం దయాకర్, ఫాదర్ థామస్‌కిరణ్, చర్చి సంఘం పెద్దలు తాటికొండ అనీత, సింగపురం రాజయ్య, తాటికొండ మధు, సింగపురం వెంకటయ్య, జీడి ప్రసాద్, రవి, నాగయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్య స్థాపనే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాలకుర్తి: ఉద్యమాల గడ్డ పాలకుర్తి నియోజకవర్గంలో తరతరాలుగా అణచివేతకు గురువుతున్న బహుజనులకు రాజ్యాధికారం కల్పించడమే బీఎస్పీ లక్ష్యమని రాష్ట్ర కమిటీ సభ్యుడు వేముల కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎన్నికల ఇన్‌చార్జ్ వేముల కృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నీర్మాల రత్నం హాజరై మాట్లాడారు. సమాజంలో అన్ని విషయాల్లో సమగ్రమైన అవగాహన కల్పించిన ముఖ్యమంత్రి అభ్యర్థి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌తో రాజ్యాధికారం సాధించడం సాధ్యమేనన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో గెలుపు తథ్యమని, బీఎస్పీ గెలిచి భారత రాజ్యాంగాన్ని అమలు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బసవగళ్ల సిద్ధయ్య, ఉపాధ్యక్షుడు ప్రేమ్ సింగ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు సోమారపు, ఉపేందర్, రాపాక శ్రీశైలం, నియోజకవర్గం అధ్యక్షుడు జిలుకర రవికుమార్, పడమటింటి భాస్కర్, కృష్ణ, చింత గణేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ ఏర్పడిందని, క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా విస్తృతం చేయాలని క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు జన్మదినం సందర్భంగా ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆదివారం 200 మందికి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు యువాన్‌జాన్, ఆమంచ నిర్మల, ఆమంచ మధుసూదన్, కేసీ జాన్‌బన్నీ, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బాబురావు జన్మదినం సందర్భంగా శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం పంపిణీ చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న భిక్షపతి

బాధ్యతల స్వీకరణ

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ జిల్లా 49వ అధ్యక్షుడిగా రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకరణ మహోత్సవంలో 2023–24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఉప జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా చేపట్టారు. అధ్యక్షుడుగా భిక్షపతి కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా మశెట్టి సంతోష్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ కన్నా పర్శరాములు, మాచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ..అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి ఎంతో మందికి సేవ చేస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార బృందం ప్రతినిధులు అంజయ్య, విజయ్, గోపయ్య, రాజమౌళి, అశోక్, ఈశ్వర్, మోహన్,ప్రమోద్ పాల్గొన్నారు.

రెండో మున్సిపాలిటీగా స్టేషన్‌ఘన్‌పూర్

- శివునిపల్లి, ఛాగల్లు జీపీలను కలిపి ఏర్పాటు
- నేడో, రేపో రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం



స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలో జిల్లా కేంద్రం తర్వాత పెద్ద నగరంగా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ త్వరలో మున్సిపాలిటీ కానుంది. దాంతో నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ జనగామ జిల్లాలో రెండో మున్సిపాలిటీగా ఏర్పాటు కానుంది. ఘన్‌పూర్‌కు జంటపట్టణంగా ఉన్న శివునిపల్లి, ఛాగల్లు గ్రామ పంచాయతీలతో కలిసి ఘన్‌పూర్ మున్సిపాలిటీ కానుంది. ఈ విషయమై నేడో, రేపో రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం పొందనుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌కు మున్సిపాలిటీ అయ్యేందుకు అన్ని అర్హతలున్నా వివిధ కారణాలతో పదేళ్లుగా ఎదురుచూడాల్సి వచ్చింది. ప్రజల నుంచి డిమాండ్ ఉన్నా.. అనివార్య కారణాలతో జాప్యం జరిగింది. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గతంలో ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ఘన్‌పూర్ కన్నా చిన్నదిగా ఉన్న వర్ధన్నపేట మున్సిపాలిటీ అయ్యిందని, అన్ని అర్హతలున్నా జాప్యం జరుగుతుందని ప్రజలు నిరాశ చెందుతున్నారు. తాజాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నుంచి కలెక్టర్, డీపీఓకు సర్క్యులర్స్ వచ్చాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రంగాచారి స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాల నుంచి అంగీకార తీర్మాన పత్రాలు అందించాల్సిందిగా ఆయా జీపీలకు సర్క్యులర్స్ పంపించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారులు అంగీకార తీర్మాన పత్రాలను జిల్లా పంచాయతీ అధికారికి ఇటీవల అందించారు. మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆయా జీపీల నుంచి వచ్చిన అంగీకార నివేదికను కలెక్టర్ నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. దీంతో నేడో, రేపో రాష్ట్ర కేబినెట్‌లో మున్సిపాలిటీ అంశం ఆమోదం పొంది ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రానుంది.

గ్రామాల వారీగా స్త్రీ, పురుషుల వివరాలు

గ్రామం	పురుషులు	స్త్రీలు	మొత్తం
స్టేషన్‌ఘన్‌పూర్	6,762	5,859	12,621
శివునిపల్లి	2,960	3,282	6,242
ఛాగల్లు	2,276	2,244	4,520
మొత్తం	11,998	11,385	23,383

2011 జనాభా లెక్కల ప్రకారం..

2011 జనాభా లెక్కల ప్రకారం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాల్లో కలిపి మొత్తం 23,483 మంది జనాభా ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మొత్తం 12,721 జనాభా ఉండగా ఎస్సీలు 4,605, ఎస్టీలు 315, ఇతరులు 7,801 మంది ఉన్నారు. శివునిపల్లిలో 6,242 జనాభా ఉండగా ఎస్సీలు 1,226, ఎస్టీలు 627, ఇతరులు 4,389 మంది ఉన్నారు. ఛాగల్లులో 4,520 మందిలో ఎస్సీలు 832, ఎస్టీలు 20, ఇతరులు 3,668 మంది జనాభా ఉన్నారు.

మున్సిపాలిటీతో లాభమా.. నష్టమా?

మున్సిపాలిటీ ఏర్పాటుతో తమకు లాభమా, నష్టమా అంటూ మూడు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీ అయితే ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు రావడంతో అభివృద్ధి గణనీయంగా జరుగుతుంది. గ్రామ పంచాయతీతో పోలిస్తే మున్సిపాలిటీకి నిధులు అధికంగా వస్తాయి. మూడు గ్రామాలు కలిసి మున్సిపాలిటీ ఏర్పడితే ఆయా గ్రామాల్లో భూముల ధరలు పెరుగుతాయి. అయితే సామాన్య, పేద వర్గాలకు పెద్దగా ప్రయోజనం ఉండదనే చర్చ జరుగుతుంది. ఇంటి పన్నులు పెరగడంతో పాటు పేదలపై అన్ని విధాల ఆర్థికంగా భారం పడుతుంది. నూతనంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలంటే అనుమతులకు ధరలు పెరుగుతాయి. స్లమ్ ఏరియాల్లో గుడిసెల్లో ఉండేవారికి ఆర్థికంగా సమస్యలు తప్పవు. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మున్సిపాలిటీల్లో ఉండవు.

నివేదిక పంపాం..



స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను కలుపుతూ ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేలా ఆయా గ్రామ పంచాయతీల నుంచి అంగీకార తీర్మానాలతో రాష్ట్ర ప్రభుత్వానికి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు నివేదిక పంపించాం. రాష్ట్ర కేబినెట్‌లో ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా అవుతుంది.

-రంగాచారి, డీపీఓ

జాతీయ జానపద మహోత్సవానికి ఒగ్గుకథ

లింగాలఘణపురం: ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకు భోపాల్‌లో జరిగే ఉత్కర్ష్ జాతీయ జానపద, గిరిజన మహోత్సవానికి రాష్ట్రం నుంచి ఒగ్గుకథ ఎంపికైంది. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని మాణిక్యాపురానికి చెందిన చండీశ్వర ఒగ్గుకళా సేవా సమితికి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు ఉస్తాద్ ఒగ్గు రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొదటిసారి ఒగ్గుకథ ప్రదర్శనకు అవకాశం దక్కిందని, జాతీయ జానపద, గిరిజన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హాజరవుతారని వివరించారు.

ఐక్యతతోనే అభివృద్ధి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

జనగామ రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో మాదిగలు ఐక్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం జనగామ మండల పరిధిలోని పసరమడ్ల స్టేజీ సమీపంలోని పంక్షన్‌హాల్‌లో మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి మేధావులు, విద్యావంతులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జాగృతి సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంజేఎస్ రాష్ట్ర కన్వీనర్‌గా డాక్టర్ అంజయ్య మహరాజ్ ఎన్నిక కాగా కో కన్వీనర్లుగా రవీందర్, బీంరావు, బాలచందర్, ఉపేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. అనంతరం సభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. మాదిగ జాగృతి సంఘం ఏ పార్టీని అనుబంధంగా లేకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని, కుల చరిత్ర జీవన విధానం నిర్మించాలని, మాదిగలను సంఘటితం చేయాలని, 12 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని నిర్ణయించారు.

బాలికపై లైంగికదాడి

● పెద్దవంగర మండలంలో ఘటన

పెద్దవంగర: బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధి ఓ గ్రామానికి చెందిన బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగస్టు 2న మంత్రి ఎర్రబెల్లికి బిరుదుల ప్రదానం

పర్వతగిరి : వర్ధన్నపేట, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి అసెంబ్లీకి వరుసగా ఆరుసార్లు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆగస్టు 2వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జనబంధు బిరుదును బహూకరించి సన్మానించనున్నట్లు జ్యోతిష్య పురోహితుడు, ఆగమ విద్వాన్ ప్రతిష్ఠాచార్యుడు పోలోజు భాస్కరాచార్యులు ఆదివారం తెలిపారు. అలాగే, పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డాక్టర్ వంగాల శాంతికృష్ణకు తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామడుగు నర్సింహాచార్య.. విశ్వ కళావిరాట్ బిరుదును అందించనున్నట్లు తెలిపారు. కాగా, సేవా, కళా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య.. ఈ బిరుదులు అందుకోవడంపై తెలంగాణ రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ దయాకర్ కనిపించడం లేదని ఫిర్యాదు

ఖిలా వరంగల్ : వరంగల్ పార్లమెంట్ సభ్యుడు పసునూరి దయాకర్ కొద్దికాలంగా ప్రజలకు కనిపించట్లేదంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఇటీవల బదిలీపై వచ్చిన ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ఎంపీ దయాకర్ ఇంటి నుంచి బయటకు రాకపోవటం బాధాకరమన్నారు. ప్రజల ఓట్లతో రెండుసార్లు గెలిచిన ఆయన నిర్లక్ష్యం తగదన్నారు. ఆయన వెంట నాయకులు కనుకుంట్ల రంజిత్, అడెపు వెంకటేష్, ఇనుముల అరుణ్, మాచర్ల రవీందర్, చిన్నారపు ఓం ప్రకాశ్, కొలారియా పాల్గొన్నారు.



B.Tech, MBA, ITI, Polytechnic Diploma, @ Low cost.
9642096424

కలక..కలవరం

● భయపెడుతున్న 'కంటి కలక' వ్యాధి
● వర్షాల ప్రభావంతో సోకుతున్న వైరస్
● జాగ్రత్తలు తీసుకుంటే తగ్గుతుంది: వైద్యుల సూచన

చెన్నారావుపేట/వెంకటాపురం(ఎం)/గీసుకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే డెంగీ, మలేరియా జ్వరాలు సోకుతుండగా తాజాగా కళ్ల కలక.. కలవరం రేపుతోంది. దీనిని పింక్ 'ఐ' అని కూడా అంటున్నారు. సాధారణ బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. జలుబు కారకమైన వైరస్‌తో కూడా కలక వస్తుందని వారు తెలుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా మందే ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలుస్తోంది. వర్షాకాలం కావడంతో వాతావరణ పరిస్థితుల కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకి కలక వస్తోందని, గాలిలో ఎక్కువగా ఉండే తేమ బ్యాక్టీరియాకు కారణమవుతోందని, ఇది కళ్లను ప్రభావితం చేస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఎలా వస్తుంది?

బ్యాక్టీరియా, కెమికల్స్, వైరస్ ద్వారా వస్తుంది. ఒకరిద్వారా ఒకరికి విస్తరిస్తుంది.

లక్షణాలు..

- కన్ను ఎర్రగా మారుతుంది
- కంటి నుంచి నీరు కారుతుంది
- కంటి రెప్పలు వాపు, ఉబ్బుతాయి.
- నిద్రించినప్పుడు కంటి రెప్పలు అంటుకుంటాయి.
- కంటి నుంచి పూసి రావడం
- కంటి నొప్పి దురద, మంట వస్తుంది.

చికిత్స...

యాంటీ బయోటిక్ 'ఐ' డ్రాప్స్, లుబ్రికాటింగ్ 'ఐ' డ్రాప్స్ వేసుకోవాలి



100 మందికి పైగా ప్రజలకు కండ్ల కలక ..

వెంకటాపురం(ఎం) మండలంలోని 9 సబ్ సెంటర్ల పరిధిలో సుమారు 100 మందికి పైగా ప్రజలు కండ్ల కలక లక్షణాలతో బాధపడుతున్నట్లు తెలిసింది. వైద్య సిబ్బంది కూడా ఎప్పటికపుడు గ్రామాల్లో పర్యటిస్తూ కండ్ల కలక వచ్చిన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మన పరిసరాలలో (ఆఫీస్‌లు, స్కూళ్లు, కళాశాలలు, ఆస్పత్రులు, ఇంటిలో) ఎవరికైనా కండ్ల కలక ఉండే వారికి దూరంగా ఉండాలి. వాళ్లు వాడిన వస్తువులు (టవల్స్, సబ్బులు ఇతర వస్తువులు) తాకడం, వాడడం చేయొద్దు. తప్పని పరిస్థితుల్లో తాకితే తరచూ చేతులను నీటితో శుభ్రం చేసుకోవాలి. కళ్ల కలక వస్తే తప్పని సరిగా కళ్లద్దాలు ఉపయోగించాలి.

- కండ్ల కలక చాలా సాధారణ కంటి జబ్బు. అయినా మొదట్లోనే దీనిని నివారించుకోవాలి. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయినా జాగ్రత్తలు పాటించాలి.
- కళ్లను మంచి నీటితో శుభ్రం చేస్తే అరికట్టొచ్చు. పరిస్థితి తీవ్రతను బట్టి కంటి వైద్యులను సంప్రదించాలి.

జాగ్రత్తలు తీసుకోవడంతో తగ్గింది..



వారం క్రితం చాలా మంది విద్యార్థినులకు కండ్ల కలక వచ్చింది. కంటి వైద్యుల సలహా మేరకు 'ఐ' డ్రాప్స్ వేశాం. పిల్లలను దూరంగా ఉంచాం. దాదాపుగా అందరికీ తగ్గుతోంది.

జ్యోతి, స్పెషల్ ఆఫీసర్, కస్తూర్బా

ఆందోళన చెందొద్దు



కంటి కలక వచ్చిన వారు ఆందోళన చెందొద్దు. పరిశుభ్రత పాటించాలి. సొంత వైద్యం చేయకుండా కంటి వైద్యులను సంప్రదించాలి. కంటి విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు.

ప్రతాపగిరి ప్రసాద్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్

జాగ్రత్తలు పాటించాలి



గాలి ద్వారా సోకే ఈ బ్యాక్టీరియా వర్షాకాలంలో వాతావరణంలో మురుగు, కాలుష్య కారకాలు పెరిగిపోవడం వల్ల వస్తుంది. ప్రస్తుతం అనేక జిల్లాలలో ప్రజలు కండ్ల కలకతో బాధపడుతున్నారు. కండ్లకలక సమస్యకు మందులు వాడకపోయినా కొందరికి తగ్గుతుంది. అయితే ఇది ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీని నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

- డాక్టర్ చీర్ల శ్రీకాంత్, పీహెచ్‌సీ వెంకటాపురం

టమాట @ 200

● మార్కెట్‌లో తగ్గని ధర
● కొనుగోలుకు జంకుతున్న వినియోగదారులు

డోర్నకల్: కూరగాయల్లో రారాజుగా పేరొందిన టమాట ధర ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజుకూ ఆకాశానికి అంటుతోంది. తాజాగా ఆదివారం డోర్నకల్ కూరగాయల మార్కెట్‌లో కేజీ టమాట రూ.200 పలికింది. డోర్నకల్ మండలంతోపాటు సమీప ప్రాంతాల్లో టమాట సాగు పూర్తిగా నిలిచిపోవడం.. దూరప్రాంతాల నుంచి దిగుమతి చేస్తుండడంతో ధర విపరీతంగా పెరిగింది. ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్ మార్కెట్లకు చిత్తూరు జిల్లా మదనపల్లితో పాటు కర్నాటక నుంచి టమాటను దిగుమతి చేస్తున్నారు.కాగా, చికెన్‌తో సమానంగా టమాట ధర పెరగడంతో ప్రజలు కొనుగోలుకు జంకుతున్నారు.



డోర్నకల్ మార్కెట్‌లో దిగుమతి అవుతున్న టమాట

హెచ్‌ఎంకు కేటీఆర్ అభినందన

● 40 మంది విద్యార్థులను కాపాడిన హెడ్మాస్టర్

ఏటూరునాగారం: కొండాయిలో వరద ఉధృతికి గురికాకుండా 40 మంది గిరిజన విద్యార్థులను సాహసోపేతంగా కాపాడి మల్యాలలోని తన ఇంటికి తరలించిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ పాయం మీనయ్యను మంత్రి కేటీఆర్ ట్వీట్‌లో అభినందించారు. కాగా, 27వ తేదీన కొండాయి ఆశ్రమ పాఠశాలను వరద చుట్టుముట్టింది. దీంతో స్కూల్‌లోని వర్కర్లకు చెప్పి హెచ్‌ఎం మీనయ్య.. పిల్లలను తీసుకుని కల్వర్టు దాటి మల్యాలలోని తన ఇంటికి తీసుళ్లాడు. అనంతరం వర్కర్లను తీసుకుని ఆ కల్వర్టు దాటేలోపు వరద మొత్తం నిండింది. అంతా 30 నిమిషాల్లో జరిగింది. జంపన్నవాగుకు తాత్కాలికంగా పోసిన కరకట్ట తెగడంతో ఈ ప్రమాదం జరిగింది. ఏమీ కాదని ఆశ్రద్ధ చేస్తే ఘోర ప్రమాదం జరిగేది. హెచ్‌ఎం మీనయ్య విద్యార్థులను తన ఇంటికి తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, 1986 సంవత్సరంలో గోదావరి వరద ఏవిధంగా వచ్చిందో ప్రస్తుతం దానికంటే ఎక్కువచ్చిందని హెచ్‌ఎం మీనయ్య తెలిపారు. 'దేవుడి దయతో బయటపడ్డాం.. గురువారం నుంచి ఇక్కడే ఉన్నా.. పిల్లలను చూసుకుంటున్నా' అని హెచ్‌ఎం మీనయ్య పేర్కొన్నారు.



మీనయ్యను అభినందిస్తూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

న్యాయం చేయాలని మహిళ ఆందోళన

మహబూబాబాద్ రూరల్ : ఓ వ్యక్తి తనను వివాహం చేసుకుని వదిలేశాడని ఆరోపిస్తూ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ ఆదివారం సదరు వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. సదరు మహిళ భర్త ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ రెండేళ్ల క్రితం మృతి చెందగా ఆమె జిల్లా కేంద్రంలోని ఓ బట్టల షాపులో పని చేస్తోంది. ఈ క్రమంలో ఆమెకు జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి పరిచయమయ్యాడు. వీరు ఏడాదిన్నర కాలం కాపురం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీన వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులుగా ఆమెను భర్త పట్టించుకోవడం లేదు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ తన ఇద్దరు కుమారులతో కలిసి భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఆయనకు గతంలోనే పెళ్లి జరిగినప్పటికీ తననూ వివాహం చేసుకున్నాడని, దీనిపై పోలీసులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంది.

అమ్మమ్మ ఇంటికి వెళ్లి అనంతలోకాలకు..

● ఫ్రిజ్‌ను ముట్టుకున్న చిన్నారి
● విద్యుత్ షాక్‌కు గురై మృతి
● లింగగిరి గ్రామంలో ఘటన
● మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు

బయ్యారం : 'ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తరువాత కోటి దేవుళ్లకు మొక్కినాక పుట్టినావు కొడుకా... నీకు ఇలా అయితుంది అనుకోలే' అంటూ ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విద్యుదాఘాతంతో మృతి చెందిన నాలుగేళ్ల చిన్నారి మృతదేహంపై పడి విలపించిన తీరు ప్రతి ఒక్క రినీ కలచివేసింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కొత్తగూడెం గ్రామ పంచాయతీ లింగగిరి గ్రామానికి చెందిన ధారవత్ భాస్కర్, కల్యాణి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు జన్మించిన తరువాత మూడో సంతానంగా అర్జున్(4) జన్మించాడు. ఇదిలా ఉండగా అర్జున్ అమ్మమ్మ కాంతి అదే తండాలో నివసిస్తుంది. ఈ క్రమంలో అర్జున్ తన అక్కలు జాహ్నవి, టింకుతో కలిసి ఆదివారం అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఆడుకుంటూ వెళ్లి ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌ను ముట్టుకున్నాడు. దీంతో విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మహబూబాబాద్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. కాగా, ప్రమాద సమయంలో పక్కనే ఉన్న అక్కలు తమ్ముడిని పట్టుకునేలోపే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకపోతే వారికి కూడా ప్రమాదం జరిగేదని తండావాసులు పేర్కొన్నారు.



అర్జున్(ఫైల్)

మరణంలోనూ వీడని పేగు బంధం..

● అనారోగ్యంతో తల్లి మృతి
● గంటల వ్యవధిలోనే కొడుకు కూడా..
● మడికొండలోని ఎస్సీ కాలనీలో ఘటన

మడికొండ : మరణంలోనూ ఆ తల్లి, కొడుకుల పేగు బంధం వీడలేదు. నవమాసాలు మోసి కని పెంచిన తల్లి చనిపోయిందని తెలుసుకున్న కుమారుడు.. ఒక్కసారిగా కుప్పకూలాడు. తనకు ఏ కష్టం రాకుండా కంటికి రెప్పలా కాపాడిన తల్లి లేని ఈ లోకంలో నాకేముందని గుండెలవిసేలా రోదించాడు. రోదిస్తూ రోదిస్తూ చివరికి తన తల్లితోపాటు తాను మృత్యు ఒడికి చేరాడు. ఈ విషాదకర ఘటన గ్రేటర్ వరంగల్ పరిధి 46వ డివిజన్ మడికొండలోని ఎస్సీ కాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన వస్కుల కొమురమ్మ(75), నాగరాజు(50) తల్లి, కుమారులు. నాగరాజు దివ్యాంగుడు. కూలీ చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్న నాగరాజుకు భార్య లక్ష్మి, ఒక్క కూతురు కృప ఉంది. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే, కొమురమ్మ కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు ఒక్కసారిగా కుప్పకూలాడు. తల్లి మృతి వార్త జీర్ణించుకోలేక ఆయన గంటల వ్యవధిలోనే అక్కడికక్కడే మృతి చెందాడు. మరణంలోనూ తల్లికొడుకుల పేగు బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, భర్తను, అత్తను కోల్పోయిన భార్య లక్ష్మి, కూతురు కృప రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సరోజన.. మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.



తల్లి కుమారుడు కొమురమ్మ, నాగరాజు (ఫైల్)

బాటిల్ క్యాప్ మింగిన చిన్నారి..

● ఊపిరాడక తీవ్ర అస్వస్థత
● ఆస్పత్రికి తరలింపు.. తొలిగిన ప్రాణపాయం

తరిగొప్పుల: ఓ చిన్నారి..సరదాగా శీతల పానీయం బాటిల్‌తో ఆడుకుంటోంది. ఆడుతూ ఆడుతూ బాటిల్‌ను మింగింది. క్యాప్ (మూత) ఊడగా అలాగే మింగింది. దీంతో ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మూతను తొలగించి చిన్నారి ప్రాణం పొడారు. ఈ ఘటన ఆదివారం మండలకేంద్రంలో జరిగింది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కూటిగల్ గ్రామానికి చెందిన ఓ చిన్నారి ఆడుకుంటూ శీతల పానీయం బాటిల్ క్యాప్‌ను మింగింది. ఊపిరాడక ఏడుస్తోంది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చిన్నారి గొంతు నుంచి బాటిల్ క్యాప్‌ను తొలగించి ప్రాణం కాపాడారు.



చిన్నారి గొంతు నుంచి తీసిన బాటిల్ క్యాప్

వలకు చిక్కిన పెద్దపాము

● అటవీశాఖ అధికారులకు తెలిపిన రైతులు

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేటలోని గుడిచెరువు మత్తడి పోస్తుండడంతో చెరువులోని చేపలు బయటకు వెళ్లకుండా మత్తడి వద్ద మత్స్యకారులు వలలను ఏర్పాటు చేశారు. మత్తడి వద్ద ఏర్పాటు చేసిన అడ్డు వలల వద్ద 5 నుంచి 10 కిలోల బరువు ఉన్న పెద్దచేపలు వల వద్ద ఎగురుతుండడంతో చాలా మంది వాటిని చూడానికి మరీ ఎగబడ్డారు. వారి ఫోన్‌లలో ఫొటోలను బంధించారు. ఆదివారం ఉదయం మత్తడి వద్ద కాపలా ఉన్న వ్యక్తి, పలువురు చుట్టు పక్కల రైతులు వెళ్లి చూ సేసరికి అడ్డుగా ఏర్పాటు చేసిన వలలో కొండచిలువలా ఉన్న పెద్దపాము చిక్కుకుంది. గమనించిన వ్యక్తులు అటవీ శాఖ అధికారులకు ఫోన్ చేశారు. అధికారులు వచ్చి పెద్దపామును పట్టుకొని వెళ్లారు. జాలర్లు చేపలను పట్టే సమయంలో వలలో ఇలాంటివి చిక్కుకుంటాయని తెలిపారు. చెరువుల్లోకి చేపల కోసం వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని పలువురు తెలిపారు.



వలలో పెద్దపాము

రైలు నుంచి పడి ట్రాన్స్‌జెండర్ దుర్మరణం

రఘునాథపల్లి : రైలు నుంచి జారి పడి ఓ ట్రాన్స్‌జెండర్ దుర్మరణం చెందిన సంఘటన రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సంగెం మండలం ఎల్గూరుస్టేషన్ తూర్పుతండాకు చెందిన ట్రాన్స్‌జెండర్ బాదావత్ అనిల్ అలియాస్ దివ్య (25) సికింద్రాబాద్ నుంచి శాతవాహన రైలులో కాజీపేటకు వస్తుంది. దివ్య రఘునాథపల్లి రైల్వేస్టేషన్ రెండోప్లాట్‌ఫాంపై చేరుకోగానే నెమ్మదిగా రైలు వెళ్తున్న క్రమంలో కిందికి దిగబోతూ ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అదే రైలులో ప్రయాణిస్తున్న మృతుడి స్వగ్రామానికి చెందిన బాలు అతని తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆడుకుంటూ వెళ్లి..

● ఇంకుడు గుంతలో పడి చిన్నారి మృతి

వెంకటాపురం(కె) : ఆడుకుంటూ వెళ్లిన ఓ చిన్నారి ఇంకుడు గుంతలో పడి అనంత లోకాలకు వెళ్లింది. ఈ ఘటన మండలంలోని వెదుల్ల చెరువు కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన వసంత, నరేష్ దంపతుల కూతురు నక్షత్ర (18 నెలల చిన్నారి) ఆదివారం ఉదయం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ క్రమంలో పాప ఒక్కసారిగా కనిపించక పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఇంటి చుట్టుపక్కల వెతకగా కనిపించలేదు. ఇంటి పక్క వారి ఇంట్లోకి వెళ్లిందని భావించి అక్కడికి వెళ్లారు. అనుమానం వచ్చి ఇంకుడు గుంతలో చూడగా అందులో చిన్నారి మృతి చెంది కనిపించింది. స్థానికులు మృతదేహాన్ని పైకి తీయగా తల్లిదండ్రులు చిన్నారి మీద పడి గుండెలవిసేలా రోదించారు. చిన్నారి మృతదేహాన్ని వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నక్షత్ర మృతదేహం

మొసలి మాంసం విక్రయిస్తుండగా పట్టివేత



స్వాధీనం చేసుకున్న మొసలి చర్మం, మాంసం

వాజేడు: గోదావరి వరదలకు వచ్చిన మొసలిని ఆదివారం మండలంలోని చంద్రుపట్లకు చెందిన కొందరు పట్టుకున్నారు. దీనిని కోసి వాటాలు వేసి విక్రయిస్తుండగా విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. మొసలిని చంపి వాటాలు వేసి మాంసం విక్రయిస్తున్నట్లు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం రావడంతో రేంజర్ చంద్రమౌళి అందుబాటులో ఉన్న సిబ్బంది వినయ్, ప్రకాష్‌రావును అక్కడికి పంపించాడు. వారి నుంచి మొసలి మాంసం, తల, చర్మాన్ని అటవీ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకుని వెంకటాపురం(కె) రేంజర్ కార్యాలయానికి తీసుకొచ్చారు. కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి.. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం నగరంలోని కరీమాబాద్‌కు చెందిన గుజ్జు వెంకటేశ్వర్లు(58) తాపీ పని చేస్తుంటాడు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పనులు లేకుండా ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి భార్యను డబ్బు అడిగాడు. ఆమె తన దగ్గర లేవని బదులిచ్చింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన వెంకటేశ్వర్లు.. మేఘన బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట ఉన్న రైల్వే ట్రాక్‌పై వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పెళ్లైన కూతుర్లు ఉన్నారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

ముగ్దుంపురంలో మరో వ్యకి..

చెన్నారావుపేట : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన వెల్దండి జ్యోతిబస్(47) ఫైనాన్స్ నడిపిస్తుండేవాడు. ఉదయం భార్య పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కుమార్తె వివాహం జరిగింది. ఘటన స్థలానికి ఎస్సై చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం తరలించారు. మృతికి గల కారణాలు ఎస్సై తోట మహేందర్‌ను కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



జ్యోతిబస్ (ఫైల్)

బండ్ పనుల్లో నాణ్యత డొల్ల

● నిర్మాణంలోనే కుంగిన రిటైనింగ్ వాల్



కుంగిన భద్రకాళి బండ్ రిటైనింగ్ వాల్

వరంగల్ అర్బన్: భద్రకాళి బండ్‌ను ఆనుకొని వరద, మురుగునీరు సాఫీగా పోయేందుకు గాయిత్రి గుడి – ఎన్‌టీఆర్‌నగర్ మీదుగా పోతననగర్ మత్తడి వరకు రెండు వైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. రూ.10కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో 2.5 కిలోమీటర్ల మేరకు చేపడుతున్న ఈ పనుల్లో రిటైనింగ్ వాల్ పలు చోట్ల నిర్మాణంలోనే కూలిపోయింది. నిర్ణీత గడువు పూర్తయినా ఇంజినీర్లు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పోతననగర్ మత్తడి వరకు రిటైనింగ్ వాల్ పూర్తి కాలేదు. బండ్ బలహీనంగా మారి ఈనెల 29న తెగిపోయి పోతననగర్, సరస్వతీ నగర్‌తోపాటు రంగంపేట నాలా వరకు వందల సంఖ్యలో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడిగా తెగిన బండ్‌ను సిమెంట్, రాళ్లు, మట్టి, ఇసుక, కంకర చూరతో నింపి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. అయినా లీకేజీలు మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి. నాలాలు ఆక్రమణకు గురికావడంతోపాటు నాలాలు, ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్‌జోన్‌లో నిబంధనలు అతిక్రమించడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది.

శాంతియుత నిరసన



చర్చి ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన ఇస్తున్న క్రైస్తవులు

హన్మకొండ చౌరస్తా: మణిపూర్‌లో హింసాకాండ సద్దుమణిగి శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆకాంక్షిస్తూ హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు సీనియర్ పాస్టర్ రెవరెండ్ జీజే.నిరంజన్‌బాబు, అసిస్టెంట్ పాస్టర్లు రెవ మైఖల్, మోజెస్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి ప్రాంగణంలో ప్లకార్డులు ప్రదర్శించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఈనెల 31న హనుమకొండ కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంఘం సంయుక్త కార్యదర్శి మోజెస్ క్రిష్టఫర్, ఉపాధ్యక్షుడు విల్సన్, సభ్యులు థామస్, నవీన్, డానియేల్ బెల్, పాల్ ప్రసన్న, పాల్, బాబీ, సందీప్, పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785634]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785698]

OLD AGE HOME

■త్రివేణి హోంకేర్, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ :9160900023, 9160900024. [H-189313]

WANTED

■ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. ప్రతిరోజు ఆదాయం. వివరాలకు సంప్ర: 7036253618. [W-189111]

■మా రియల్‌ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు అనుభవం గల టెలికాలర్స్ & అసోసియేట్ మెంబర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటీవ్స్ + కమీషన్ కలవు. సంప్ర॥ 9959567858. [W-189106]

■కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 7893700904, 9014504770, 8977743043. [W-1002992]

■మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ ఆడ్స్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221504]

■Pest Control ఆఫీస్‌లో పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ కావలెను. స్పాట్ జాయినింగ్, Near by హన్మకొండ, వరంగల్. ఫోన్ : 8466959595 [H-796923]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

WANTED TEACHERS

■Wanted Hindi and supporting Lady Teachers for 1st to 5th classes Indian Kids High school, SVN Road, WGL. Cell: 9963006221. [W-189115]

■To teach Primary English, Science, Maths and for high school Physics, Spoken English, Computer Tr. Contact Immediately. Standard High School, Kashibugga, Wgl. Cell: 8522066699, 7680873344. [W-189114]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ :9010144453
వరంగల్ :9705748198
నర్సంపేట :9010144453
జనగామ :9951602871
మహబూబాబాద్ :9010144453
పరకాల :9010299096
జయశంకర్ భూపాలపల్లి :9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.